క్లుప్తంగా

128మందికి వైద్యపరీక్షలు



శనగపాడు(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ ఆయుర్వేద వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వై.రత్నప్రియదర్శిని సూచించారు. మండలంలోని శనగపాడు గ్రామంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 128 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈసందర్భంగా ఆయుర్వేద వైద్యపై అవగాహన కల్పించటంతోపాటు మన చుట్టూ ఉన్న మొక్కలతో కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

75శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతి



కంచికచర్ల :రానున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు ఎక్కువశాతం మార్కులు వచ్చేలా తమ వంతు కృషి చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ అఫీజ్ షేక్ అహ్మద్ తెలిపారు. కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలన్నారు. హాజరుశాతం 60శాతం కంటే తక్కువగా ఉంటే తల్లికి వందనం పథకం కింద ఉపకార వేతనం అందదన్నారు. 75శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రోజూ కళాశాలకు పంపించాలని కోరారు. కళాశాలలో డిజిటల్ క్లాస్‌రూములు, నాణ్యతతో కూడిన బెంచీలు, కంప్యూటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందిస్తున్నామన్నారు. దీంతో విద్యార్థుల హాజరుశాతం కూడా పెరిగిందని వివరించారు. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశుగణన ప్రారంభం

కంచికచర్ల: మండలంలో పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా గండేపల్లిలోని పంచాయతీ కార్యాలయంలో పశుగణన వాల్‌పోస్టర్‌ను సర్పంచ్ బొక్కా రవికుమార్ ఆవిష్కరించారు. అనంతరం పశువైద్యాధికారి నవీన్ మాట్లాడుతూ ఈ పశుగణన కార్యక్రమం ఏడాది ఫిబ్రవరి 24వతేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. తమ ఇబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులు, గేదెలు, ఆవులు, దూడలు తదితర జంతువుల వివరాలను సేకరిస్తారని వివరించారు. నాయకులు ఎం.రామకృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ షోడగిరి సతీష్‌కుమార్, పశుపోషకులు పాల్గొన్నారు.

మునేటి ఒడ్డున ఇసుక తవ్వకాల నిషేధం



వత్సవాయి: మండలంలోని లింగాల మునేటి ఒడ్డు నుంచి ఇసుక తవ్వకాలను నిషేధిస్తున్నట్లు తహశీల్దార్ ఎస్.నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగాల వద్ద సీపీడబ్ల్యూఎస్ గ్రామీణ తాగునీటి సరఫరా పథకాలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం ఉచితంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చినందున ఈ పథకాల సమీపంలో వందలాది మంది ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీంతో మంచినీటి పథకాలు దెబ్బతింటాయంటూ పలువురు ఫిర్యాదు చేయడంతో మంచినీటి పథకాలకు సమీపంలో ఇసుక తవ్వకాలను నిషేధించినట్లు ఆయన వివరించారు. ఈ మంచినీటి పథకాల వద్ద నుంచి ఎవరైనా ఇసుకను తరలించేందుకు యత్నిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

నష్టం కొండంత..పరిహారం గోరంత

- మునేరు వరదలకు కొట్టుకుపోయిన మామిడి చెట్లు
- రైతులకు రూ.కోటికిపైగా నష్టం
- అందరికీ అందని పరిహారం
- సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులు



మామిడితోటలో ఏర్పడిన భారీగొయ్యిలో నిలిచిన వరదనీరు



పెనుగంచిప్రోలులో వరదకు కొట్టుకు వచ్చిన మామిడి చెట్లు(ఫైల్)



తువ్వకాలువ గండ్లుపడటంతో వేమవరంలో కోతకు గురైన మామిడి తోటలు

పెనుగంచిప్రోలు: గత నెలలో సంభవించిన భారీ వర్షాలు, మునేరు వరదలకు మామిడితోటలకు భారీనష్టం వాటిల్లింది. వరద ఉధృతికి మామిడి తోటలు కోతకు గురికాగా, మామిడిచెట్లు కొట్టుకుపోయాయి. తోటలో పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఇసుక దిబ్బలు పేరుకుపోయాయి.

15హెక్టార్లలో దెబ్బతిన్న తోటలు..

ఉద్యానవన శాఖాధికారులు అంచనాల ప్రకారం జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో 15 హెక్టార్లలో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. దీంతో రూ.కోటి మేర నష్టం వాటిల్లింది. 33శాతం మేర నష్టపోయిన తోటలకు హెక్టారుకు రూ.35 వేలు ప్రభుత్వం మంజూరు చేయగా, పలువురికి పరిహారం అందింది. అయితే వరదల కారణంగా జరిగిన నష్టానికి, ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారానికి ఏమాత్రం పొంతన లేకుండా ఉందని బాధితరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు బాధితులకు పరిహారమే అందలేదని వారు వాపోతున్నారు.

కొట్టుకుపోయిన టేకు చెట్లు..

వరద నీటి ఉధృతికి మామిడి తోటల్లో గట్లపై పెంచిన టేకు చెట్లు కూడా నామరూపాలు లేకుండాపోయాయి. మునేరు తువ్వకాలువకు 50 చోట్ల వరకు గండ్లు పడటంతో వత్సవాయి మండలంలోని ఆళ్లూరుపాడు, వేమవరం, పెనుగంచిప్రోలు మండలంలో మామిడి తోటలు భారీగా కోతకు గురయ్యాయి. కొన్నిచోట్ల మామిడితోటల్లో భారీగోతులు ఏర్పడి నేటికీ వరదనీరు నిలిచే ఉంది. ఇలా వరదలకు దెబ్బతిన్న ఈమామిడి తోటలను బాగుచేసుకోవడం రైతులకు తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారాన్ని పెంచడంతోపాటు అందరికీ అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

200 చెట్లు కొట్టుకుపోయాయి..



మాసోదరుడు సత్యనారాయణకు చెందిన ఆరు ఎకరాల్లోని మామిడితోటలో 230 మామిడిచెట్లు ఉండగా, మునేరు వరదకు తువ్వకాలువకు గండి పడటంతో ప్రస్తుతం 30చెట్లు మాత్రమే మిగిలాయి. తోట మొత్తం పెద్దఎత్తున గోతులు పడి ఇసుక మేట వేసింది. నా పొలంలో 25అడుగులపైన గొయ్యి ఏర్పడింది. నీళ్లు ఎంత లోతు ఉన్నాయో కూడా తెలియకుండా ఉంది. ప్రభుత్వ నష్టపరిహారం ఏమాత్రం చాలదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

–మాదల రంగయ్య, రైతు, వేమవరం, వత్సవాయి మండలం

ఎకరం భూమి కోతకు గురైంది..



మునేరు పక్కన ఉన్న ఏడెకరాల మామిడి తోటలో మునేరు వరదకు సుమారు ఎకరం మేర పొలం కోతకు గురైంది. ఎన్నో ఏళ్లుగా పెంచుతున్న మామిడి, టేకు చెట్లు నీటిలో కలిసి పోయాయి. గతేడాది వరదకు 25సెంట్లకుపైగా భూమి కోతకు గురైంది. మతోటను రక్షించుకునేందుకు గట్టును రాళ్లు, మట్టితో కట్టలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.10లక్షలకు పైగా ఖర్చు అవుతోంది. ప్రభుత్వం ఆదుకోకపోతే కోలుకోలేం.

–దివ్వెల నారాయణరావు, రైతు, పెనుగంచిప్రోలు

నేడు క్లాప్‌మిత్రలతో ఆత్మీయ సమ్మేళనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట):మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో శనివారం నుంచి కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నితిన్ శుక్రవారం తెలిపారు. సచివాలయాలలో పని చేస్తున్న పారిశుద్ధ్యకార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి వారి సమస్యలను తెలసుకోవటంతోపాటు వారికి తగిన సదుపాయాలు కల్పించడమే ఈ కర్యాక్రమ ఉద్దేశ్యమన్నారు. సచివాలయాల కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తాదమని వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జుజ్జూరు(వీరులపాడు):ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఎం పోరాడుతోందని ఆపార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు ఆంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరులో శుక్రవారం పార్టీ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శిగా చాట్ల రవి, కమిటీ సభ్యులుగా పల్లెకంటి బాబు, షేక్ లాల్ అహ్మద్ గౌస్, గడ్డం ప్రభాకర్, అద్దంకి స్వామి, మారపాక శ్రీనుబాబు, గుంజి వీరయ్య, చాంద్ బేగం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు. నాయకులు కోడూరు పిచ్చేశ్వరరావు, వట్టికొండ పార్థసారధి చనుమోలు సైదులు పాల్గొన్నారు.

గ్రామసభ నిర్వహణ

రావిరాల(జగ్గయ్యపేట): మండలంలోని రావిరాల గ్రామంలో శుక్రవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ అనూష్‌బాబు మాట్లాడుతూ రైతులు పంట పొలాలలకు సంబంధించిన సరిహద్దు వివాదాల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 11 అర్జీలు అందినట్లు ఆయన వివరించారు.

డ్వాక్రా సభ్యులతో సమావేశం



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాస్

పేరకలపాడు(కంచికచర్ల): బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణాలు పొందవచ్చని ఏపీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పేరకలపాడు పంచాయతీ కార్యాలయంలో డ్వాక్రా సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా సభ్యులకు బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలు, స్త్రీనిధి వంటి రుణాలను తక్కువ వడ్డీకి ఇస్తున్నట్లు వివరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించేందుకు బ్యాంకు రుణాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తీసుకున్న రుణాలను డ్వాక్రా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో వీఏఓగా పనిచేసిన మహిళపై వచ్చిన అభియోగాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. సర్పంచ్ సాత్విక, మండల సమాఖ్య అధ్యక్షురాలు అరుణ, సీసీలు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు ఎమ్మెల్యే అభినందన



పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామటౌన్: క్రీడలతో మానసికోల్లాసంతోపాటు భవిష్యత్తులో ఉద్యోగావకాశాల్లోనూ తగిన ప్రాధాన్యం లభిస్తుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఇటీవల గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని శుక్రవారం ఆమె తన కార్యాలయంలో అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వారియర్ జిమ్‌కు చెందిన వారు ఆయాపోటీలలో పాల్గొనడమే కాకుండా పతకాలు సాధించి నందిగామకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమంటూ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భద్రతపై కార్మికులకు అవగాహన



కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయిస్తున్న రామ్‌కో కంపెనీ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ

జయంతిపురం(జగ్గయ్యపేట): కార్మికులు కర్మాగారాల్లో భద్రతా నియమాలు పాటించాలని రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ సూచించారు. 39వ గనుల భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని జయంతిపురంలో ఉన్న రామ్‌కో కర్మాగారం కార్మికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారాలలో పని చేసే కార్మికులు భద్రతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ముఖ్యంగా భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దరిచేరవని పేర్కొన్నారు. కర్మాగారం కార్మికుల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని వివరించారు. అనంతరం రావిరాల, బూదవాడ గ్రామాల్లోని గనులను కార్మికులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఇండియా, సాగర్ సిమెంట్స్ ప్రతినిధులు విశ్వనాథరెడ్డి, శ్రీనివాసరావు, రామ్‌కో సిబ్బంది ఫరూక్‌మహ్మద్, జాన్‌రెడ్డి, రామకృష్ణసాయి, కార్మికులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు



నందిగామలో జాతీయ రహదారి పక్కనున్న దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

నందిగామటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కనున్న దుకాణాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. పట్టణంలోని చందర్లపాడు రోడ్డు, బస్టాండ్ నుంచి రైతుపేట వరకు 65వ నంబరు జాతీయ రహదారికి ఇరుపక్కలా ఉన్న చిరువ్యాపారుల దుకాణాలను పోలీస్‌ల సహకారంతో తొలగించారు. చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని అభివృద్ధి పేరు చెప్పి తమ దుకాణాలు తొలగించవద్దని వేడుకున్నా ఫలితం లేకపోయింది. నియోజకవర్గ ప్రజాప్రతినిధి మౌఖిక ఆదేశాలతోనే తమ దుకాణాలను తొలగిస్తున్నారని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చే శారు. పాలకులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

వీరులపాడు: వలసలు నిరోధించేందుకే ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తోందని ఏపీవో జనార్దన్ అన్నారు. మండలంలోని తాటిగుమ్మి, దొడ్డదేవరపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజాఅవసరాలకు అనుగుణంగా ఉపాధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం చేసిన పనులు, అందిన కూలీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రామకృష్ణ, మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తోట నారాయణ, కార్యదర్శులు రాజశేఖర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణా సేవాసమితికి అగ్నిమాపక డీజీ ప్రశంస



జగ్గయ్యపేట: పట్టణంలోని అన్నపూర్ణా సేవా సమితి ఆహార పంపిణీ విషయంలో చేస్తున్న కృషి ప్రశంసనీయమని అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ పేర్కొన్నారు. సంస్థ నిర్వాహకులు మహంకాళి జయప్రకాష్ దంపతులను విజయవాడలో శుక్రవారం ఆయన అభినందించారు. అనంతరం ఆహార పంపిణీ విధానాలను, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

రేపట్నుంచి పవిత్రోత్సవాలు

నందిగామటౌన్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయ స్వామి వారి ఆలయ పవిత్రోత్సవాలను ఈనెల 27వతేదీ నుంచి 30వతేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఈవో ఫణికుమార్ శుక్రవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 27న భగవదనుజ్ఞ, విష్వక్సేనారాధన, పుణ్యాహవచన, మేదినీ పూజ, అంకురార్పణ, మృత్సంగ్రహణ, 28న రక్షాబంధన పూజ, పంచగవ్యారాధన, వాస్తు హోమం, అకల్మష హోమం, పవిత్ర ప్రతిష్ట, 29న అగ్నిప్రణయనం, కుంభ ఆరాధన, ఉక్త హోమాలు, స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ, రాత్రికి స్వామివారికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. 30న మహా పూర్ణాహుతి, కుంభ సమారోపణ, అక్షతారోపణ, యజమాన ఆశీర్వచన కార్యక్రమాలతోపాటు సాయంత్రం 6.30గంటలకు స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పవిత్రోత్సవాలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఈవో ఫణికుమార్ కోరారు.

భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి

జుజ్జూరు(వీరులపాడు): ఎర్రుపాలెం–అమరావతి రైల్వేలైన్ కింద భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందించాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో పార్టీ ఎనిమిదవ మండల మహాసభలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేజోన్ పేరుతో ప్రభుత్వం భూములు సేకరిస్తోందని, భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ద్వారా పరిహారం అందించాలని కోరారు. రైతులకు న్యాయం చేసిన మీదటే పనులు దాములూరు–కూడలి మధ్యన కట్టలేరుపై బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డును నిర్మించటంతోపాటు ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు కొట్టుకుపోయిన రహదారులకు తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట కళ్యాణ్, చనుమోలు సైదులు, వట్టికొండ పార్థసారథి, రమేష్, మంగళపూడి సుందర్‌రావు, షేక్ చాంద్ బేగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ డీసెంట్



పేట కమిషనర్ రామ్మోహనరావుకు డీసెంట్ లెటర్‌ను అందజేస్తున్న షేక్ హఫీజున్నీసా

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ నడిబొడ్డున పాతమున్సిపల్ కార్యాలయం కూడలిలో ఉక్కు కళావేదిక నిర్మాణ సమయంలో ఓ షాపును తొలగించి ఏర్పాటు చేసిన ద్వారాన్ని మూసివేసి, షాపును నిర్మించడంప మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ హఫీజున్నీసా అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ విషయంపై శుక్రవారం ఆమె మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావును కలిసి డీసెంట్ లెటర్ అందజేశారు. అనంతరం హఫీజున్నీసా విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ సహకారంతో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ఉక్కు కళావేదికకు రెండు వైపులా ద్వారాలు ఉంటే మంచిదన్నారు. భద్రత చర్యల్లో భాగంగా రెండు ద్వారాలు ఉండటం సముచితమన్నారు. అయితే ఉక్కు కళావేదికకు వాయువ్య మూలన ఉన్న ద్వారాన్ని మూసివేసి షాపును పునర్నిర్మించాలనుకోవడం తగదన్నారు. చట్టాన్ని పరిరక్షించాల్సిన వారే ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతుండటం దురదృష్టకరమన్నారు. బాధ్యతగల వైస్ చైర్మన్‌గా ఈ అనైతిక పనిలో తాను భాగస్వామి కాదలచుకోక ఈ మేరకు నిన్నటి కౌన్సిల్ సమావేశంలోని 45వ అంశంగా ఉన్న విషయాన్ని వ్యతిరేకించానన్నారు. డీసెంట్ లెటర్ కూడా అందజేసినట్లు తెలిపారు. ఈ డీసెంట్ లెటర్ కాపీలను గుంటూరు మున్సిపల్ డీఎంఏకి, జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఆర్‌డీ, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్‌కి పంపిస్తున్నట్లు ఆమె వివరించారు.

ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా



జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్ నియంతృత్వ, నిరంకుశ, ఏకపక్ష ధోరణితోపాటు డిపోలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వ్యతిరేకిస్తున్నామని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అన్నారు. ఈమేరకు ఆర్టీసీ కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డిపో వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిపో అసిస్టెంట్ మేనేజర్ కార్మికులను, ఉద్యోగులను జంతువులతో పోలుస్తూ నోటికి వచ్చినట్లు దూషిస్తున్నారని ఆరోపించారు. విషయాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, ఆయన వైఖరి ఉదాసీనంగా ఉండటాన్ని కార్మికులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విజయవాడ సెక్యూరిటీ విజిలెన్స్ అధికారిని కలిసి డిపోలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడు కళ్యాణం కృష్ణారావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, డిపో కార్యదర్శి ఎ.ఆనంద్, డ్రైవర్స్ అసిసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.సాంబశివరావు, షేక్ జిలానీ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.









ఉత్కంఠగా సాగిన కబడ్డీ పోటీలు

కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని ఐదు జిల్లాల సెంట్రల్ జోన్ కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ కబడ్డీ పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. ఈ పోటీల్లో 48 ఇంజినీరింగ్ కళాశాలల జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీలను నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల్లో విజయవాడ ఎస్ఆర్‌కే జట్టు విజేతగా నిలువగా, దివిలి కిట్స్, మిక్ కళాశాల జట్లు వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నాయి. విజేతలను ఏసీపీ రవికిరణ్, మిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీ కిరణ్, సీఈఓ డి.పాండురంగారావు, పీడీ నిమ్మగడ్డ శౌరయ్య, టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ జీపీ రాజు, రూరల్ సర్కిల్ సీఐ డి.చవాన్, కంచికచర్ల ఎస్ఐ బోనగిరి రాజు అభినందించారు. – కంచికచర్ల